మంగళవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం :	34.0°C
కనిష్ఠం :	22.0°C

కాంగిరేస్!

వరంగల్ ఎంపీ స్థానంలో భారీగా ఆశావహులు



- 42మంది దరఖాస్తు.. ఉద్యోగుల పేర్లను పరిశీలనకు తీసుకోని అధిష్ఠానం
- ఏఐసీసీకి మూడేసి పేర్లతో టీపీసీసీ ప్రతిపాదనలు
- సింగపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్యల్లో చాన్స్ దక్కేదెవ్వరికో?
- ఇద్దరిలో విజయావకాశాలపై కాంగ్రెస్ అంతర్గత సర్వే
- మంత్రులు భట్టి, కొండా, పొంగులేటి, ఎమ్మెల్యేల అభిప్రాయాల సేకరణ
- అధిష్ఠానం నిర్ణయంపై కాంగ్రెస్ కేడర్‌లో ఉత్కంఠ

వరంగల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ లోక్‌సభ సీటుపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ పెరుగుతోంది. వరంగల్ ఎంపీ టికెట్ కోసం అత్యధికంగా 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువగా ఉద్యోగులు ఉండటంతో వారిని పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీలో మొదటి నుంచి పని చేస్తున్నవారిని గుర్తించిన స్క్రీనింగ్ కమిటీ ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఏఐసీసీకి పంపింది. ప్రధానంగా గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సింగపురం ఇందిరా, దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్ పేర్లను స్క్రీనింగ్ కమిటీ ప్రతిపాదించింది. దీంతో ఏఐసీసీ ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో స్క్రీనింగ్ కమిటీ నుంచి వచ్చిన ముగ్గురి బలబలాలపై అంతర్గత సర్వే నిర్వహిస్తోంది.

42మంది దరఖాస్తులు

వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఏకంగా 42మంది దరఖాస్తు చేసుకు న్నారు. అయితే వీరిలో ప్రభుత్వ ఉద్యోగులే డజను మందికి పైగా ఉండటం చర్చనీయాంశమైంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేంత డబ్బు ప్రభుత్వ ఉద్యోగులకు ఎక్కడిదనే చర్చ జరిగింది. ఎంపీ టికె ట్ కోసం వచ్చిన దరఖాస్తుల ను ఏఐసీసీ నియమిం చిన పరిశీలన కమిటీ పరిశీలిం చింది. స్థానికేతరు లు కూడా భారీగా దరఖాస్తులు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ సీటును స్థానికేతరు లు గెలిచిన చరిత్ర లేకపోవటంతో వారి దరఖాస్తుల ను కూడా ఆ కమిటీ పక్కన పెట్టినట్టు సమాచారం. ఇక ప్రభుత్వ ఉద్యోగుల దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోకుండా, పార్టీ కోసం పని చేస్తున్న 12మందికిపైగా స్థానిక ఆశావహులను పరిశీలన కమిటీ గుర్తించింది. వీరిలో గత ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటి చేసి ఓడిపోయిన సింగాపురం ఇందిరా, గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును పార్టీ ఆదేశాలతో త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్ పేర్లను ఏఐసీసీ ఎన్నికల కమిటీకి చేరవేసింది. ఈ ముగ్గురు పేర్లతో పాటు నలుగురైదుగురి ప్రొఫైల్ కూడా పంపించారు. ఒకవేళ ఈ ముగ్గురు కాకుంటే ఈ నలుగురైదుగురిలో ఒక పేరు పరిశీలించాలని కూడా టీపీసీసీ విజ్ఞప్తి చేసినట్టుగా సమాచారం.

అభిప్రాయ సేకరణ

వరంగల్ ఎంపీ టికెట్ కోసం స్క్రూటినీ కమిటీ ముగ్గురి పేర్లతో ఏఐసీసీకి జాబితాను పంపింది. ఈ జాబితాపై ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీ రెండు రోజులుగా వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సునిల్ కనుగోలు బృందంతో పాటు మరో రెండు సర్వే ఏజెన్సీలతో ఫ్లాష్ సర్వేలు నిర్వహించింది. ఈ సర్వేల్లో మొదటిరెండు స్థానాల్లో ఇందిరా, సాంబయ్య నిలిచినట్టు సమాచారం. దీంతో ఈ ఇద్దరిపై సర్వేల రిపోర్టుతో పాటు వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల నుంచి ఏఐసీసీ ప్రతినిధులు అభిప్రాయ సేకరణ చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, స్టేషన్‌ఘనపూర్ మినహా ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. అలాగే పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంత్రి కొండా సురేఖతో పాటు ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నుంచి కూడా అభిప్రాయాలను ఏఐసీసీ ప్రతినిధులు సేకరించినట్లుగా సమాచారం. అంగబలం, ఆర్థిక బలం ఉండటంతో పాటు కాంగ్రెస్ పార్టీ సేవ చేసిన వారిలో ఎవరికి టికెట్ ఇచ్చిన గెలిపించేందుకు కృషి చేస్తామని మెజారిటీ ఎమ్మెల్యేలు స్పష్టం చేసినట్టు ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా వరంగల్ ఎంపీ సీటుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని, పక్కాగా వరంగల్ సీటులో పాగా వేయాలని, గెలిచే అవకాశం ఉన్నవారికే ఏఐసీసీ నుంచి టికెట్ వస్తుందని ఆయన కాంగ్రెస్ నేతల వద్ద ప్రస్తావిస్తున్నట్టు సమాచారం. వరంగల్ ఎంపీ స్థానానికి సింగాపురం ఇందిర, దొమ్మాటి సాంబయ్య మధ్యే టికెట్ రేస్ ఉందన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. దీంతో టికెట్ ఆశిస్తున్న ఇద్దరి బలబలాలను కాంగ్రెస్ అధిష్ఠానం సేకరిస్తోంది.

కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎవరు?

- బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకటనతో ఆ పార్టీల్లో ఉత్కంఠ
- మానుకోట స్థానంపై పలువురి దృష్టి

మహబూబాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా మాలోతు కవిత పేరు ను ప్రకటించారు. దీంతో ఇప్పటి వరకు బీఆర్ఎస్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసిన ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులుగా ఎవరిని ప్రకటిస్తారా అన్న విషయంలో అటు ఆ పార్టీల్లోనూ ఇటు ప్రజల్లోనూ ఉత్కంఠ కనిపిస్తోంది. అయితే ఎవరికి వారే.. తమకే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటుండడంతో కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారితోపాటు దరఖాస్తు లేకుండానే అగ్రనేతల వద్ద ప్రయత్నాలు చేస్తున్న వారు మొత్తం 50 మంది వరకు ఉండగా.. వారిలో ఎవరికి టికెట్ అనేది ఇంకా తేలలేదు. అయితే ఎస్టీ రిజర్వుడ్‌గా మహబూబాబాద్ ఎంపీ స్థానం ఆవిర్భావ తొలి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఇప్పటికే ఈ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను చుట్టి వచ్చిన.. బలరాంనాయక్‌కే అధిష్ఠానం నుంచి సంకేతాలున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీలోనూ ఇరువురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. గతంలో మహబూబాబాద్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన యాప సీతయ్యతో పాటు మహబూబాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిన బంజారా, గిరిజన సామాజికవర్గానికి చెందిన జాటోతు హుస్సేన్‌నాయక్ రేసులో ఉన్నారు. వారు టికెట్ తనకంటనే.. తనకంటూ ప్రచారం చేసుకోవడంతో పాటు పోటాపోటీ వాల్‌రైటింగ్స్‌తో నియోజవర్గ వ్యాప్తంగా ముందస్తు ప్రచారం చేసుకుంటున్నారు.

దివ్యస్థలం.. కురవి వీరభద్రుడి క్షేత్రం

ఆలయంలో ఎన్నో ప్రాచీనమైన గురుతులు

కురవి, మార్చి 5: బహుప్రాచీనమైన దివ్యస్థలం కురవి వీరభద్రుడి క్షేత్రం. క్రీ.శ 850లో నిర్మించిన ఈ ఆలయంలో ఎన్నో ప్రాచీనమైన గుర్తులు, కట్టడాలు భక్తులను ఆకట్టుకుంటాయి. పురాతనమైన ఆలయ అభివృద్ధిపై సకాలంలో పాలకులు దృష్టి సారించనప్పటికీ, భక్తులు మాత్రం వెల్లువలా తరలివస్తారు. ఈ నెల 8నుంచి మహాశివరాత్రి జాతర పురస్కరించుకుని భక్తుల కోసం ఆలయంలోని పురాతన నిర్మాణాలపై ప్రత్యేక కథనం.


కురవిలో కాకతీయుల కాలంలో నిర్మించిన రాతి దీప స్తంభం

- **రాతినంది స్తంభం :** పురాతనకాలంలో ఆలయాన్ని నిర్మించినాడే రాతి నంది స్తంభాన్ని నిర్మించారు. ఆలయానికి ధ్వజ స్తంభం లేని పురాతన రోజుల్లో ఇదే ధ్వజ స్తంభంగా మొక్కబడేది.
- **దీప రాతి స్తంభం :** కాకతీయుల కాలంలో ఏకశిలరాతి స్తంభంపై చెక్కించిన దీపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. కార్తీకమాసంలో ఈ ఏకశిల రాతి దీపాన్ని వెలిగిస్తారు.
- **చెక్క రథం :** వీరభద్రస్వామి కల్యాణం జరిగిన ఎనిమిది రోజుల తర్వాత కురవి పురవీదుల్లో భద్రకాళి సమేత వీరభద్రుడిని ఊరేగిస్తారు. పురాతన కాలంలో చేసిన ఈ రథం ప్రస్తుతం శిథిలావస్థలో ఉంది. రథాన్ని ఉంచేందుకు సైతం ఆలయ పరిసరాల్లో పూర్తిస్థాయి స్థలం కేటాయించలేదు. గత ప్రభుత్వం కేటాయించిన రూ.5కోట్ల నిధుల్లో రథశాలకు నిధులు కేటాయించినా నిర్మించలేదు. ఈ పురాతన రథాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది.
- **అనుబంధ ఆలయాలు :** వీరభద్రస్వామి ఆలయానికి అనుబంధంగా భద్రకాళి దేవాలయం, శివాలయం, నాగేంద్రస్వామి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాలు ఉన్నాయి. భద్రకాళి దేవాలయాన్ని నిర్మించినప్పటికీ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలను నిర్వహించలేదు. ఆంజనేయ స్వామి ఆలయాన్ని, నవగ్రహమండపాలను శివాలయానికి తరలించారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలి

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్


జాతర పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

కురవి, మార్చి 5 : ఈ నెల 7 నుంచి జరిగే కురవి వీరభద్రస్వామి మహాశివ రాత్రి జాతరపనులను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రు నాయక్ మంగళవారం పరిశీలించారు. వీరభద్రస్వామి కల్యాణం జరిగే నాగేంద్ర స్వామి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు స్వామివారి కల్యాణం తిలకించేందుకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా

మిగతా 8వ పేజీలో..

ఏజెన్సీలో మారుమోగనున్న శివనామస్మరణ

రేపటి నుంచి గుండం శివాలయంలో శివరాత్రి పర్వదిన వేడుకలు


గుండం శివాలయం

కొత్తగూడ, మార్చి 5 : ఏజెన్సీలో శివనామస్మరణం మారుమోగనుంది. అడవుల్లో ఆధ్యాత్మిక వాతవరణం నెలకొననుంది. కాకతీయుల కాలం నాటి శివాలయంలో శివ రాత్రి వేడుకలకు చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించనున్నారు. ప్రభుత్వాలు శివాలయాన్ని పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు కమిటీ వేసుకుని సొంత ఖర్చులతో జాతర నిర్వహణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 7నుంచి 10 వరకు నాలుగు రోజులు గుండం శివాలయంలో శివరాత్రి పర్వదిన వేడుకలు నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున రానున్నారు.

దేవస్థాన కమిటీ

గౌరవ సలహదారులుగా సర్పంచ్ గట్టి చిన్ననర్సయ్య(బాబు), ఉప సర్పంచ్ కొట్టే నాగేష్, ఎంపీటీసీ బైరబోయిన సదానందం, ప్రధాన అర్చకులు భానుప్రసాద్, సభ్యులుగా గట్టి మధు, దానం నారాయణ, గోరంటల వేణు, గట్టి సత్యనారాయణ, గుళ్లపల్లి శ్రీనివాస్, బానోత్ బాలు, గట్టి రమేష్, బిట్ల శ్రీనివాస్, దండు ప్రవీణ్, పెన్క సతీష్, వద్ది సోమయ్య, జాటోత్ రాజా, ఈసం సందీప్, మద్ది కళ్యాణ్, ఈక నర్సింగరావు, ఐలి రామస్వామి, బిట్ల శ్రీను, వాసం శివ జాతర నిర్వహణ చేయనున్నారు.

- **బస్‌వేళలు:** గుండం జాతరకు రావాలనుకునే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించనున్నారు. ఉదయం 7గంటలకు, సాయంత్రం 4గంటలకు, రాత్రి 7గంటలకు బస్ సౌకర్యం కల్పించారు. వివిధ వాహనాలలో నర్సంపేట నుంచి రావాలనుకునే భక్తులు నర్సంపేట, అశోక్‌నగర్ దబ్బీర్‌పేట, కీర్యాతండా నుంచి గుండం శివాలయంకు చేరుకోవచ్చు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఇల్లందు, మహబూబాబాద్, గూడూర్ నుంచి వచ్చే భక్తులు కొత్తగూడ, పొగుళ్లపల్లి నుంచి గుండం మీదుగా శివాలంకు చేరుకోవచ్చు..

ముగిసిన మేడారం హుండీల లెక్కింపు

జాతర ఆదాయం రూ.12,71,79,280

హనుమకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఆదాయం మొత్తం రూ.12,71,79,280 లెక్క తేలింది. గత జాతర కన్నా రూ.26,29,553 ఎక్కువ. గత జాతర ఆదాయం రూ. 12,45,49,727. దీనితో పోల్చితే ఈసారి జాతర ఆదాయం ఏ మంత ఎక్కువ పెరగలేదు. ప్రతీ జాతరకు ఆదాయం రూ. కోటిపైనే పెరుగుతూ వచ్చింది. ఈ సారి మాత్రం ఆశించినంత పెరగలేదు. గత జాతర కన్నా ఈ సారి భక్తులు ఎక్కువగానే వచ్చినట్టు అంచనా. హుండీలను కూడా గతంలో కన్నా ఎక్కువగానే ఏర్పాటు చేశారు.. అయినా జాతర ఆదాయం పెరుగుదల రూ.26లక్షలకే పరిమితమైంది. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర హుండీల లెక్కింపు మంగళవారంతో ముగిసింది. ఆరోరోజు 50 హుండీలను లెక్కించగా రూ.1,46,09,280. జాతరలో భక్తులు బంగారం, వెండి రూపంలో వేసిన కానుకలను కూడా మంగళవారం మదింపు వేశారు. బంగారం 779 గ్రాముల 800 గ్రాములు కాగా, వెండి 55 కిలోల 150 గ్రాములు వచ్చింది. దీనిని బ్యాంకు ట్రెజరీలో భద్రపరిచారు. గత జాతర కన్నా ఈసారి బంగారం, వెండి కానుకలు కాస్త ఎక్కువగా వచ్చాయి. లెక్కించిన ఉండీ ఆదాయాన్ని బ్యాంకులో జమచేశారు. హుండీల నుంచి వెలువడిన బియ్యం మొత్తాన్ని జల్లెడపటి బస్తాల్లో నింపారు. నాణాలను లెక్కించాల్సి ఉంది. ఈ సారి నాణాలు భారీగానే వచ్చాయి.

పల్లె నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ జెండా ఎగరాలి

- ప్రజల సంకల్పంతో ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


మరిపెడ సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సభకు హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలు

మరిపెడ, మార్చి 5: రాహుల్‌గాంధీని ప్రధానమంత్రి చేసే వరకు పల్లె నుంచి ఢిల్లీ దాకా ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్ జెండే ఎగిరేలా ప్రతీ కార్యకర్త ఓ సైనికుడి వలె పని చేసి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరైనా హస్తం గుర్తుపై ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాం గ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మరిపెడ ఎంపీడీవో ఆఫీస్ ప్రాంగణంలో మంగళవారం రాత్రి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అధ్యక్షతన కాంగ్రెస్ సభ జరుగగా మంత్రి పొంగులేటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గట్టి సంకల్ప బలం చూపి రాష్ట్రంలో ఇందిరమ్మరాజ్యం తెచ్చుకున్నారన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ఒక్కొక్కటిగా మన సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ త్వరలోనే మాఫీ చేసే కార్యచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మహిళలకు రూ.2500 ఇచ్చే స్కీంకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే అమలవుతున్న మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యబీమా, రూ.500లకే గ్యాస్ సిలీండర్, 200 యూనిట్లకు ఉచిత కరెంట్ ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇక ఈ నెల 11న భద్రాచలం రామయ్య సన్నిధిని ప్రారంభించే ఇందిరమ్మ ఇంటి పథకానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారన్నారు. డోర్నకల్, మానుకోట నియోజకవర్గాలకు ఆదనంగా ఇళ్లు మంజూరు చేస్తానని అన్నారు. రాబోయే ఆర్నెళ్ల ఎంపీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల కోసం కష్టపడి పనిచేయండి నాలుగున్నరేళ్లు సుఖంగా ప్రభుత్వ పథకాలు పొందవచ్చని తెలిపారు.

రావణసురుడిని ఓడించాం. .ఇక శూర్పణక పని పట్టాలి..

డోర్నకల్ నియోజకవర్గానికి శనిగా పట్టిన రావణసురుడిని ఓడించాం.. ఇప్పుడు జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఇక శూర్పనక పని పట్టాలని ప్రజల హర్షధ్వనాల మధ్య ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. తన గెలుపుకోసం పని చేసిన కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. మానుకోట ఎమ్మెల్యే మరళీనాయక్ మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ కేంద్ర మంత్రి బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నెం శ్రీకాంత్‌రెడ్డి, విజయ బాయి, రాధబాయి, జిల్లా కాంగ్రెస్ నాయకలు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి మరిపెడ మండల పార్టీ అధ్యక్షుడు పెండ్లీ రఘువీర్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, గంధసిరి అంబరీశ, కాలం రవీందర్‌రెడ్డి, మరిపెడటౌన్ అధ్యక్షుడు తాజుద్దీన్, మాజీ జడ్పీటీసీ అంబటి వీరభద్రం, గునిగంటి కమలాకర్, వల్లూరి కృష్ణారెడ్డి, కోట వెంకటరెడ్డి, గుగులోత్ రవి, ఐలిమల్లు, అప్సర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారంటీ పథకాల నివేదిక సేకరణ

విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం. రిజ్వి


మహబూబాబాద్ వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

మహబూబాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారంటీ పథకాల లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన నివేదికలను సేకరించి ప్రజాపాలన సాఫ్ట్ వేర్‌లో నమోదు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్ఏఎం. రిజ్వి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు, సాఫ్ట్ వేర్‌లో వివరాల నమోదుపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ కార్యదర్శి ఎస్ఏఎం. రిజ్వి మాట్లాడుతూ... అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి గ్యారంటీ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని చెప్పారు. ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, మునిసిపాలిటీల్లో అవసరమైన మేర ప్రజాపాలన సేవాకేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాపాలనలో క్షేత్ర స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్‌కనెక్షన్‌నెంబర్, విద్యుత్‌మీటరు నెంబర్ వివరాలు లింక్ ఉన్న దరఖాస్తు దారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. గృహజ్యోతికింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తు న్నామని, దరఖాస్తులో వివరాలు సరిగ్గా నమోదు చేయనివారు నూతన దరఖాస్తులను ప్రజా పాలన సేవాకేంద్రాలద్వారా అందించవచ్చన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో వినియోగించే సాఫ్ట్‌వేర్ పనితీరును రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వీసీలో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఆర్‌డీవో పురుషోత్తం, డీపీవో హరిప్రసాద్, జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద, మునిసిపల్ కమిషనర్లు నోముల రవీందర్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు అనంతరం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల్లో ఏదైనా తప్పులున్నచో రేషన్, ఆధార్‌కార్డు, విద్యుత్‌బిల్లు, గ్యాస్ బుక్ ద్వారా సేవా కేంద్రాల్లో సరి చేసుకోవాలని సూచించారు.

కన్నీరుమున్నీరు..

- అశ్రునయనాల మృతుల అంత్యక్రియలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే, నాయకుల సంతాపం

తొర్రూరు రూరల్, మార్చి 5: దుర్గమ్మ పండుగకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో సోమవారం రాత్రి పర్వతగిరి మండలం మోత్యాతండాలో జరిగిన సంఘటన ముగ్గురు ప్రాణాలను బలితీసుకోవడంతో ఆ తండావాసులు కన్నీరుమున్నీరయ్యారు. ఆ మృతుల అంత్యక్రియలను మంగళవారం వారివారి స్వగ్రామా ల్లో పూర్తి చేశారు. ఘటనలో గాయపడిన మోత్యాతండాకు చెందిన భూక్యా రవిని చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇక రవి కుమారుడు జశ్వంత్‌కు గాయాలు కావడంతో ఎంజీఎంలోనే చికిత్స పొందుతున్నాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం దేవేందర్, సునీల్‌ల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించారు. పలువురు ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయాం..

సునీల్ తల్లిదండ్రుల రోదన


బానోతు సునీల్ (ఫైల్)

తొర్రూరు మండలం జమస్థాన్‌పురం గ్రామ శివారు సుందర్ నాయక్‌తండాకు చెందిన బానోతు సునీల్ (19) మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద గిరిజన రైతు బానోతు వీరూ, సోని దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు సునీల్. వారికున్న 20గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సునీల్ ఇంటర్ చదువుతూ కూలీ పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. ఈ క్రమంలో మోత్యాతండాలో నిర్వహించే దుర్గామాత వేడుకలకు టెంటు వేయడానికి వెళ్లిన కుమారుడు మృతి చెందాడు. దీంతో తమకు అండగా ఉండే ఒక్కగానొక్క కుమారుడిని కోల్పోయామని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. నిరుపేద గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

‘లహరి’ బస్సుల్లో సుఖవంతమైన ప్రయాణం

ప్రయాణికులకు సౌకర్యంగా పడకలు




లహరి బస్సులో సౌకర్యాలు

సుబేదారి, మార్చి 5: రాష్ట్ర ప్రభుత్వం వరంగల్-1 డిపోకు నాలుగు లహరి సెమీ స్లీపర్ బస్సులను కేటాయించింది. గత నెల 3వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఈ బస్సులను హనుమకొండ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ బస్సులను ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇందులో స్లీపర్, సీటర్ సౌకర్యం ఉంది. ప్రయాణికులకు ఈ బస్సుల్లో 20 బెడ్స్, 22 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 20 మంది ప్రయాణికులు పడుకునేందుకు వీలుగా, 22 మంది ప్రయాణికులు కూర్చుని వెళ్లేందుకు వీలుగా అన్ని సౌకర్యాలు ఈ బస్సుల్లో ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు రోజు రెండు బస్సులు హనుమకొండ నుంచి బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సు రోజు సాయంత్రం 4:30 గంటలకు ఒక బస్సు, 6:30 గంటలకు మరో బస్సును బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఈ బస్సుల్లో మంటలు, ఇంజన్‌లో పొగలు వస్తే సెన్సార్‌ల ద్వారా గుర్తించవచ్చు. బటన్ నొక్కితే ఈ బస్సు ప్రయాణించే దగ్గరి డిపోలకు ఇన్ఫర్మేషన్ వెలుతుంది. అప్పుడు అధికారులు అప్రమత్తమై ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడుకోవచ్చు.

ప్రయాణికులకు సౌకర్యంగా బెడ్స్

హనుమకొండ నుంచి బెంగళూరుకు ప్రయాణించే ప్రయాణికులలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉంటారు. గతంలో ఈ బస్సులో లేనప్పుడు వేరే ఆర్టీసీ బస్సులలో కూర్చుని ప్రయాణించినప్పుడు ప్రయాణికులు అలసిపోయి తెల్లారి ఉద్యోగానికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉండేది. లహరి బస్సులలో బెడ్స్ సౌకర్యం ఉండడంతో పడుకుని ప్రయాణించడం వలన ఎలాంటి ఇబ్బంది, అలసట ఉండదు. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి కేయూలో రూబీజెస్ట్

కేయూ క్యాంపస్, మార్చి 5: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో మార్చి 6, 7 తేదీల్లో రూబీజెస్ట్-24 టెక్నికల్ పెస్ట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం ప్రారంభం కానున్న రెండు రోజుల సంబురాల ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు హాజరుకానున్నారు. కేయూ ఆడిటోరియంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకు సంబురాలు వైభవంగా షురూ అవుతాయి. రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో టెక్నికల్ సెషన్లు, చర్చలు, సెమినార్‌హాల్‌లో ఆఖరు రోజున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా మంగళవారం కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంలు రూబీజెస్ట్-24 పోస్టర్‌ను ఆవిష్కరించారు. అలాగే మంగళవారం సాయంత్రం రూబీజెస్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు.

ఆటో డ్రైవర్లకు అండగా నిలవాలి

వడ్డేపల్లి, మార్చి 5: ఆటోడ్రైవర్లకు పోలీసు శాఖ అండగా నిలవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ఆటో డ్రైవర్స్ జేఏసీ చైర్మన్ ఎమ్డీ అంకూషా వలి, జిల్లా గౌరవ అధ్యక్షుడు చిర్ర రమేష్ గౌడ్ తదితరులు హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హనుమకొండ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణను వారు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఆటో డ్రైవర్స్ జేఏసీ వైస్ చైర్మన్ పసుల యాదగిరి, కన్వీనర్లు దేవర మల్లేష్, బండి లింగయ్య, ఓరుగంటి సదానందం ఉన్నారు.

గ్రంథాలయాల్లో ఉద్యోగుల్లేరు..

● అన్ని పోస్టులు ఖాళీ ● ఇన్‌చార్జిలే దిక్కు ● 30 ఏళ్ల నుంచి నియామకాల్లేవు ● ఉన్న ఉద్యోగులపై పని భారం
● సిబ్బంది లేక ఇబ్బందులు ● ఉమ్మడి జిల్లాలో దీనస్థితిలో గ్రంథాలయాలు ● నోటిఫికేషన్లతో లైబ్రరీలకు నిరుద్యోగులు పరుగు


జనగామ జిల్లా బచ్చన్నపేటలోని శాఖా గ్రంథాలయం


ములుగు జిల్లా కేంద్ర గ్రంథాలయం

హనుమకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : యువత సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. విజ్ఞానానికి, విరామకాల సద్వినియోగానికి, విశేషజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు మానవ జీవితంలో విడదీయరాని సంబంధం కలిగి ఉంటున్నాయి. ఆధునిక యుగంలో సౌకర్యాలెన్ని పెరిగినా విద్యార్థులకు, ఉద్యోగార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞానార్జనకు గ్రంథాలయాలే ప్రధాన ఆధారాలు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా, ఉద్యోగార్థులను ఉద్యోగస్తులుగా చేయడంలో కీలక భూమిక పోషించే గ్రంథాలయాలు ఉద్యోగుల కొరతతో కూనారిల్లుతున్నాయి. ఉద్యోగవేటలో ఉన్న నిరుద్యోగులకు చేయూతనిస్తున్న గ్రంథాలయాలే చాలినంత సిబ్బంది లేక చచ్చుపడి పోతున్నాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్లను జారీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లోని ఖాళీలను పట్టించుకోవడం లేదు.

ఉద్యోగార్థుల పరుగులు

గ్రంథాలయాలు విద్యార్థులు, ఉద్యోగార్థుల పాలిట కల్పతరువుగా నిలుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువు దీరిన నేపథ్యంలో మెగా డీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలు నిర్వహిస్తుండడంతో యువత పఠనాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని రోజులుగా గ్రంథాలయాలు సందడిగా కనినిస్తున్నాయి. కానీ అక్కడ శాశ్వత సిబ్బంది లేక వెక్కిరిస్తున్న ఖాళీలతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. దీంతో నిర్వహణ కొరవడి పాఠకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

30 ఏళ్లుగా నియామకాల్లేవు

1995లో శాఖాపరంగా ఉద్యోగాలు భర్తీ చేశారు. ఆ తర్వాత కాలంలో గ్రంథాలయాల్లో ఉద్యోగుల నియామకాలు జరగలేదు. ఈమధ్యకాలంలో అనేక మంది రిటైర్ అయ్యారు. గ్రంథపాలకులు మొదలుకొని స్వీపర్ల వరకు అనేక ఖాళీలు ఏర్పడ్డాయి. అయినా ఈ మూడు దశాబ్దాలకాలంలో వచ్చిన ప్రభుత్వాలు ఏవీ వాటిని భర్తీ చేయలేదు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నెట్టుకువస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టే సంఖ్యలోనే ఉన్నారు. సిబ్బంది కొరతవల్ల వారిపై అదనపు పనిభారం పడుతోంది. కొన్ని శాఖా గ్రంథాలయాల్లో స్వీపర్లే ఇన్‌చార్జి గ్రంథపాలకులుగా విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్ల ఒకే ఉద్యోగి రెండు, మూడు గ్రంథాలయాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఒక్కోదానికి రెండు లేదా మూడు రోజులు కేటాయిస్తున్నాడు. గ్రంథ పాలకులు లేని రోజుల్లో అటెండరు లేదా స్వీపర్లు గ్రంథాలయాన్ని తెరిచి దినపత్రికలను మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. బుక్ సెక్షన్లు మూసే ఉంటున్నాయి. సిబ్బంది కొరత వల్ల చాలా చోట్ల గ్రంథాలయాలను ఎప్పుడు తెరుస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమకు ఈ పరిస్థితి ఇబ్బందిగా ఉందని ఉద్యోగార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని పాలకులు

గ్రంథాలయాల వ్యవస్థను ఒక ప్రభుత్వ శాఖగా కాక దానినొక సంస్థగా భావిస్తుండడంవల్ల పట్టింపు లేకుండా పోయింది. గ్రంథాలయ సంస్థలు రాజకీయ పదవులకు పునరావాస కేంద్రాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమకు అనుకూలమైనవారికి నామినేటెడ్ పదవుల పందారంలో భాగంగా చైర్మన్లను నియమించడంలో ఉన్న శ్రద్ధ.. వాటి నిర్వహణలో కీలక పాత్ర పోషించే సిబ్బందిని నియమించడంలో చూపడం లేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లకాలంలో వాటి గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. చైర్మన్లుగా నియమితులైన వారు సిబ్బంది కొరత వల్ల సైతం గ్రంథాలయాల నిర్వహణను మెరుగుపరచలేకపోతున్నారు.

కనీస వసతులు కరవు

జిల్లా కేంద్రాల్లోని గ్రంథాలయాలకు అరకొర నిధులు ఇవ్వడం మినహా వాటి అభివృద్ధికి పెద్దగా చర్యలు తీసుకోలేదు. మున్సిపాలిటీల నుంచి వచ్చే గ్రంథాల సెస్సే వాటికి ఆర్థిక వనరు. అవి చెల్లించే నిధులతోనే ఏదో విధంగా నెట్టుకువస్తున్నాయి. గ్రామాల్లో పంచాయతీల నుంచి వచ్చే లైబ్రరీ సెస్సు చాలా తక్కువ. చాలా పంచాయతీలు వీటిని చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో శాఖా గ్రంథాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. శాఖా గ్రంథాలయాల్లో చాలా వాటికి స్వంత భవనాలు లేవు. అన్నీ అద్దె ఇళ్లలో అరకొర వస్తుల నడుప నడుస్తున్నాయి. పాఠకులు చదువుకోవడానికి కనీస వసతులు మచ్చుకైనా కానరావు. చాలినన్నీ కుర్చీలు, బెంచీలు లేవు. ఇక పుస్తకాల అందుబాటు అంతంత మాత్రమే..

ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలలో ఆరు జిల్లా గ్రంథాలయాలు, 66 శాఖా గ్రంథాలయాలు, ఒక ప్రాంతీయ గ్రంథాలయం ఉన్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ఉన్న ప్రాంతీయ గ్రంథాలయం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక లైబ్రరీ. దీనికి సొంత భవనం ఉంది. ఇందులో చాలినంత మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లిస్తుంది. మిగతా గ్రంథాలయాల పరిస్థితి వేరు. ఇవన్నీ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. ఇందులో పనిచేసే వారంతా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు. మున్సిపాలిటీలు గ్రంథాలయ సెస్సుద్వారా వచ్చే ఆదాయం నుంచే వీరికి వేతనాలు.

20 ఖాళీలు

హనుమకొండ జిల్లాకు సంబంధించి 33 శాంక్షన్ పోస్టులకుగాను ప్రస్తుతం 13మంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్లు అయిదుగురు మాత్రమే ఉన్నారు. ముగ్గురు ఔట్‌సోర్సింగ్ విధానం కింద పని చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది అంతా పార్ట్‌టైమర్స్. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉమ్మడి జిల్లా అంతటికి అతిపెద్ద లైబ్రరీ. దీనితోపాటు 11 శాఖా గ్రంథాలయాలు, అయిదు గ్రామ గ్రంథాలయాలు, ఒక పిల్లల లైబ్రరీ ఉన్నాయి. ఉద్యోగుల కొరతవల్ల ఒక్కొక్కరు రెండు అంతకన్నా ఎక్కువ గ్రంథాలయాలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఇద్దరు గ్రేడ్ 2 లైబ్రేరియన్లకు బదులు ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. మరొకరిని డిప్యూటేషన్‌పై తీసుకున్నారు. ఇద్దరు వాచ్‌మెన్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా లేరు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు ప్రకటించడంతో ఉద్యోగార్థుల కోసం ఈ గ్రంథాలయం పని వేళలను పెంచారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తోంది. చాలినంత మంది సిబ్బంది లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు 11 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ 11 లైబ్రరీల్లో రెండింటికే పూర్తికాలపు లైబ్రేరియన్లు ఉన్నారు. మిగతా ఎనిమిదింటిని పంచాయతీ సిబ్బందితో నెట్టుకువస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో జిల్లా లైబ్రరీతో పాటు 12 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖా లైబ్రరీలు పార్ట్‌టైమ్ ఉద్యోగులతో నడుస్తున్నాయి. ములుగు జిల్లా పరిధిలో తొమ్మిది లైబ్రరీలు ఉన్నాయి. ములుగులో జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం (నూగూరు)లో శాఖా గ్రంథాలయాలున్నాయి. ఈ తొమ్మిది లైబ్రరీలలో ఎనిమిదింటికి గ్రంథపాలకులు లేరు. కొత్త నియామకాలు లేకపోవడంతో వీటి బాధ్యతలు ఇన్‌చార్జిలకు అప్పగించారు. ములుగు సెంట్రల్ లైబ్రరీలో ఒక గ్రేడ్ 1, ఇద్దరు గ్రేడ్ 2, లైబ్రేరియన్లు, ఇద్దరు అటెండర్లు, వాచ్‌మెన్, స్వీపర్, బుక్‌కీపర్, బైండింగ్ వర్కర్, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనగామలో ఒక జిల్లా గ్రంథాలయంతో పాటు పది శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. శాఖ లైబ్రరీల్లో వేటికి పూర్తికాలపు లైబ్రేరియన్లు లేరు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో నడిపిస్తున్నారు.

హామీలను దాటవేసే ప్రయత్నంలో కాంగ్రెస్

తిరుమలలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

తిరుమల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హామీలిచ్చిందని, కానీ ఇచ్చిన ప్రతి హామీని దాటవేసే ప్రయత్నం చేస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ విమర్శించారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు.పదేళ్ల పాటు రాష్ట్రంలో బ్రహ్మాండమైన పరిపాలన అందించినప్పటికీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిందన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టేలా పరిపాలన చేస్తున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో సాగు, తాగునీటి కొరతతో పాటు విద్యుత్ కొరత కూడా మొదలైందన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు పోరాడే శక్తిని కేసీఆర్‌కు ప్రసాదించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.ప్రజలపక్షాన పోరాడే నాయకులను మాత్రమే ఎంపీలుగా ఎన్నుకోవాలని తెలుగు రాష్ట్రాల ప్రజలను కోరారు.

గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

వడ్డేపల్లి, మార్చి 5: ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ పేరుతో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలని గద్దర్ ఆలోచన ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ మంచాల ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గద్దర్ విగ్రహాన్ని అన్ని జిల్లాల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో గద్దర్ ఆలోచన వేదిక రాష్ట్ర కో కన్వీనర్ ఐత అనిల్, రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

ఇస్రో పిలుస్తోంది..

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహనే లక్ష్యం ● భావి శాస్త్రవేత్తలకు వేదిక.. యువికా.. ● 9వ తరగతి విద్యార్థులకు దరఖాస్తుల ఆహ్వానం
● ఈనెల 20 వరకు అవకాశం ● ఈనెల 28, ఏప్రిల్ 4న ఎంపిక జాబితా ● ఎంపికైన వారికి మే 13 నుంచి శిక్షణ

జఫర్‌గఢ్, మార్చి 5 : పిల్లల ఆలోచనలకు మెరుగులు దిద్దితే భావి తరానికి శాస్త్రవేత్తలుగా మార్చుకోవచ్చు. ఈ విషయాన్ని గుర్తించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో).. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అంతరిక్షపరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ఓవినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అనువర్తనాలపై ప్రాథమికజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా యంగ్ సైంటిస్ట్ పేరుతో యువ విజ్ఞాన కార్యక్రమాన్ని (యువికా) 2019 నుంచి నిర్వహిస్తోంది. బాల్యదశ నుంచే శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగ్, గణితం ఆధారిత పరిశోధన కెరీర్‌లో కొనసాగే వారికి ఇది వేదికగా నిలుస్తోంది. 2024 సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అర్హులు. ప్రస్తుతం దరఖాస్తుప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. అర్హత, ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు.

ఈనెల 20 వరకు దరఖాస్తుకు అవకాశం

ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా www.isro.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2024, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఈనెల 28న మొదటి ఎంపిక జాబితా, ఏప్రిల్ 4న రెండో ఎంపిక జాబితాలను ప్రకటిస్తారు. ఎంపికైన వారు మే 12న ఇస్రో సూచించిన కేంద్రాలవద్ద రిపోర్టు చేయాలి.

దరఖాస్తుకు అర్హతలు - వెయిటేజీ కేటాయింపు

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 8వ తరగతిలో 50 శాతం మార్కులు సాధించి ఉండాలి. 9వ తరగతి విద్యార్థులుసహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్‌ఎస్‌ఎస్‌లో పాల్గొంటే ఐదు మార్కులు, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థికి మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే 13 నుంచి 25వ తేదీ వరకు ఇస్రోకు సంబంధించి దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్-బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్‌సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ - తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైదరాబాద్, నిటీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఈ ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇస్తారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి : పి.రఘునందన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక లాంటిది. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

హనుమకొండ మత్స్యశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ కుమార్ యాదవ్ తనపై వేధింపులకు పాల్పడుతున్నారని, కులంపేరుతో దూషించటంతోపాటు అనుచితంగా ప్రవర్తిస్తున్నారని ఫిషరీస్ అసిస్టెంట్ పి. మేఘన ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఈమేరకు ఫిర్యాదు కాపీని మంగళవారం మీడియాకు విడుదలచేశారు. హనుమకొండ జిల్లా కార్యాలయం నుంచి భీమారం ఫిష్ ఫామ్‌కు తనను బదిలీచేసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఫిష్ ఫామ్‌లో ఒంటరి మహిళకు విధులు వేసి ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఐఎఫ్‌టీసీ, ఐనవోలు మండల బాధ్యతల నుంచి కూడా అకారణంగా తప్పించారని తెలిపారు. సిబ్బంది ఎదుట తనను కులం పేరుతో దూషించటంతోపాటు అసభ్యకరమైన వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నారని, పరుష పదజాలంతో మాట్లాడుతున్న నరేష్ కుమార్ నాయుడిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేఘన విజ్ఞప్తిచేశారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

హనుమకొండ క్రైం, మార్చి 5: సుబేదారి పీఎస్ పరిధిలోని గాయత్రి కాలనీలో ఏడుగురు పేకాటరాయుళ్లను వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.15వేల నగదుతో పాటు 2 ద్విచక్ర వాహనాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. సీఎస్ఆర్ గార్డెన్స్ సమీపంలోని గాయత్రికాలనీలో కొద్ది రోజులుగా ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్టు పక్కా సమాచారం అందింది. తమ సిబ్బంది మూకుమ్మడిగా దాడి చేసి 7 గురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.15వేల నగదు బైక్స్, సెల్‌ఫోన్లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జూదరులను సుబేదారి పోలీసులకు అప్పగించి గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.


ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్

భీమునిపాదం వద్ద అరుదైన పక్షులు

కనువిందు చేస్తున్న ఇండియన్ పార్యరడైజ్ ఫ్లైక్యాచర్, మెడల్ ఉడ్ ఓవల్ (గుడ్లగూబ), జంగిల్ ఓవ్‌లెట్ పక్షులు


జంగిల్ ఓవ్‌లెట్


మెటల్ వుడ్ ఓవెల్

మహబూబాబాద్ జిల్లా భీమునిపాదం జలపాతం వద్ద అరుదైన పక్షులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి అందాలకు ప్రతీక అయిన భీమునిపాదం వద్ద అనేక రకాల పక్షులు ఆవాసం ఏర్పరచుకోవడం కనిపిస్తోంది. వాటిల్లో ఒకటి ఇండియన్ ప్యారడైజ్ ఫ్లై క్యాచర్. ఈ వింత పక్షి మెడ నల్లగా ఉండి, మిగతా శరీర భాగం తెల్లగా ఉంటుంది. తలపై అదే నల్లరంగులో జుట్టు ఉంటుంది. దీని తోకభాగం తెల్లని ఈకెలతో చాలా పొడవుగా ఉంటుంది. ఈ పక్షికి ఈ తోకే ఆకర్షణీయం. ఇక్కడ దర్శనమిస్తున్న మరో పక్షి గుడ్లగూబ. గుడ్లగూబలు సాధారణంగా అడవుల్లో చెట్లకొమ్మలపై ఉంటాయి. సాధారణంగా కనిపించే గుడ్లగూబ కన్నా భీమునిపాదం వద్ద దర్శనమిస్తున్న గుడ్లగూబ పక్షి భిన్నంగా ఉంది. దీనిని మెటల్డ్ వుడ్ ఏవెల్. దీని ఈకలు అచ్చం చెట్టు బెరడు రంగులో ఉంటాయి. అందువల్ల చెట్లపై ఉన్నప్పుడు ఆ చెట్టుబెరడు రంగుతో కలిపిపోయి గుర్తించడం కష్టంగా ఉంటుంది. అందుకే దీనికి లోహపురంగుతో కూడి చెట్టుబెరడు గుడ్లగూబగా పేరువచ్చింది, దీని పిల్లలు బూడిద రంగులో ఉంటాయి. పెరిగిన తర్వాత రంగుమారుతాయి. ఇక్కడే మరో రకం గుడ్లగూబ కూడా సందర్శకులకు కనువిందు చేస్తుంది. ఇది అడవి గుడ్లగూబ. సాధారణంగా అడవిలో మనకు ఎక్కువగా కనిపించే పక్షి ఇదే. దీనిని జంగిల్ ఓవ్‌లేట్ అని పిలుస్తారు. ఇదేకాకుండా అనేక ఇతర జాతి పక్షులను కూడా ఇక్కడ చూడవచ్చు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

మట్టిని తరలిస్తే చర్యలు తప్పవు

తొర్రూరు, మార్చి 5: ప్రభుత్వ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములు, కాలువల నుంచి మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని మండల రెవెన్యూ అధికారి రాహుల్ అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్టె గ్రామ శివారులోని వ్యవసాయ భూముల నుంచి కొంత మంది అక్రమంగా మట్టిని తరలిస్తుండగా ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈసందర్భంగా రాహుల్ ఆయన మాట్లాడుతూ బాధిత రైతులు కష్టపడి పంటలు సాగు చేసుకుంటుంటే కొందరు అక్రమార్కులు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని వారిపై చర్యలు తప్పవన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మండలంలోని కంటాయపాలెం గ్రామ శివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై జగదీష్ తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా వెళ్తున్న ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందన్నారు. తగు చర్యల నిమిత్తం మైనింగ్ శాఖకు పంపడం జరిగిందని, అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలుంటాయని తెలిపారు.

వలస కూలీల పిల్లలకు పోలియో చుక్కలు

గార్ల, మార్చి 5 : మండలంలోని వివిధ గ్రామాల్లో ఒరిస్సా , మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మిర్చి కోయడానికి వచ్చిన వలస కూలీల పిల్లలను గుర్తించి నోడల్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ నేతృత్వంలో ప్రత్యేక వైద్యసిబ్బంది బృందం మిర్చి కోయడానికి వచ్చిన వలస కూలీ పనులు చేసే ప్రదేశంలోకి పోయి వారి పిల్లలను గుర్తించి మంగళవారం పోలియో చ్కులను వేశారు. మండలంలోని పోచారం పుల్లురు, మర్రిగూడెం, గోపాలపురం, బుద్దారం, సీతంపేట, ముల్కనూరు పంట పొలాల్లోని వందలాది మంది చిన్నారులకు పోలీయో చుక్కలను వేశారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, రాజశేఖర్, రాధాకృష్ణ, ఇస్మాయిల్, పద్మ, సదాలి, కామేశ్వరి పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 : హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామాంతపూర్‌లో 1వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలు పొందేందుకు అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి ఈ నెల 14న ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బాలురు -3, బాలికలు -3 లక్కీడిప్ ద్వార జిల్లా కలెక్టర్ ఎంపిక చేస్తారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణవాసులకు రూ.2 లక్షలు, గ్రామీణావాసులకు రూ.1.50 లక్షల ఆదాయం ఉండాలన్నారు. విద్యార్థులు 1-06-2017 నుంచి 31-05-2018 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు మూడు పాస్‌ఫోటోలు, ఆదాయం, కులం, నివాసం, జనన ధ్రువీకరణపత్రాలు జత చేయాలన్నారు.

మోడల్ క్రీడా పాఠశాలల ప్రవేశం కోసం దరఖాస్తులు..

మోడల్ క్రీడా పాఠశాలల్లో కొత్తగూడలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 5 తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు చేసుకోవాలని క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.దేవదాస్ మంగళవారం తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6వ తరగతిలో ఒక సీటు, 7వ తరగతిలో నాలుగు, 8వ తరగతిలో ఒకసీటు, 9వ తరగతిలో 4 సీట్లు, పదో తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయని చె ప్పారు. వాటర్ స్పోర్ట్స్ స్కూల్ బోయినపల్లిలో 5వ తరగతిలో 40 సీట్లకు తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన విద్యార్థులు అర్హులని అట్టి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ(కో ఎడ్యుకేషన్) బోయినపల్లి హైదరాబాద్ యందు ప్రవేశం పొందడానికి విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులను క్రీడాపాఠశాల కొత్తగూడ, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకుల కార్యాలయం మహబూబాబాద్‌లో కూడ అందించాలన్నారు.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్?

పార్టీని వీడనున్న మునిసిపల్ పాలకవర్గ సభ్యులు!

తొర్రూరు, మార్చి 5: బీఆర్‌ఎస్‌కు పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మునిసిపాలిటీలో బిగ్ షాక్ తగలనుంది. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డితో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై మంగళవారం స్థానిక వాట్సాప్ గ్రూప్‌లలో చక్కర్లు కొట్టింది. ఈవిషయంపై బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సీతారాములును వివరణ కోరగా మునిసిపల్ పాలకవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలుస్తోందన్నారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో చేరేందుకు వారు హైదరాబాద్ వెళ్లగా సీఎం పార్టీ, అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉండటంతో సమయం ఇవ్వలేదని సమాచారం. మునిసిపల్ పాలకవర్గ సభ్యులు పార్టీ మారడంపై స్పష్టత రావాల్సి ఉంది.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 5: కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ పటిష్టత కోసం కష్టపడి పనిచేయాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే రెండు నెలల్లో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెండు నెలలు కష్టపడితే ఐదేళ్ల పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. రాజకీయ లబ్ధికోసమే ప్రతిపక్షాలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న పార్టీలకు దీటుగా సమాధానం ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, పార్టీలో చేరేందుకు చాలామంది చూస్తున్నారని, ఎవరు చేరినా కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ త్వరలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

అర్హులకు జీవో నంబర్ 58 ద్వారా పట్టాలివ్వాలి

మహబూబాబాద్ టౌన్, మార్చి 5: అర్హులైన నిరుపేదలకు జీవో నెంబరు 58 ద్వారా పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ...మునిసిపాలిటీ 22వవార్డు పరిధిలోని మాణిక్యనగర్, టీబీ నగర్, నాలుగోవార్డు పరిధిలోని సున్నా నారాయణనగర్, జ్యోతిబసనగర్‌లో గత ప్రభుత్వ హాయంలో 58 జీవో ద్వారా పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, అధికారులు సర్వేలు చేసి అర్హులను గుర్తించి సంవత్సరమవుతున్న వారికి పట్టాలివ్వలేదని విమర్శించారు అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, నాయకులు హేమానాయక్, శ్రీనివాస్, ఉపేంద్ర, అనిత పాల్గొన్నారు.



మహబూబాబాద్‌మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

బీఆర్‌ఎస్ హయంలోనే ఆలయాల అభివృద్ధి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, మార్చి 5: బీఆర్‌ఎస్ హయంలోనే సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆలయాలను అభివృద్ధి చేయడం జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగరలో గౌడకులస్థుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మాజీ పాలకుర్తి దేవస్థాన చైర్మన్ వి రామచంద్రయ్యశర్మ, మండల ఇన్‌చార్జి సోమేశ్వర్‌రావు, సోమారెడ్డి, శ్రీరాం సుధీర్, ఎన్‌ఆర్‌ఐ సునిల్‌రెడ్డి, ముత్తినేని శ్రీనివాస్, మల్లికార్జున్‌చారి, అశోక్, రాజుయాదవ్, హరీష్, మహేష్, దేవేందర్ పాల్గొన్నారు.



విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

మరిపెడ రూరల్, మార్చి 5: మండలంలోని అబ్బాయిపాలెం శివారు పత్తికుంట తండాకు చెందిన గుగులోతు వెంకన్న, లక్ష్మీ దంపతుల కూతురు సుచిత్ర. పత్తికుంట తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం చేసింది. అనంతరం ఉన్నత చదువులు చదివి 2015లో బీఏఎంఎస్‌లో(బ్యాచురల్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ) సీటు సాధించింది. ఆ తర్వాత సుచిత్రకు 2022లో మరిపెడ మండలంలోని ఆనేపురం ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో చేరి డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. పత్తికుంట తండాలో గతంలో తనకు అక్షరాలు నేర్పిన అంగన్‌వాడీ టీచర్ జెన్నా సంపూర్ణను అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం శాలువతో సన్మానించింది.

మరిపెడ కవికి సన్మానం

మరిపెడ, మార్చి 5: మండల కేంద్రానికి చెందిన కవి, విమర్శకుడు పెద్దోజు నరేశ్‌ను మద్రాస్ యూనివర్సిటీ తెలుగుశాఖ ఆచార్యులు మంగళవారం సన్మానించారు. మద్రాస్ యూనివర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో మంగళవారం చెన్నైలో నిర్వహించిన అంతర్జాతీయ కవి సమ్మేళన సదస్సులో నరేశ్ పాల్గొన్నారు. కవిత్రయ మహాభారతం- వర్తమన సమాజం-సమాలోచనంపై వివరించడంతో ఆయనను ఆ యూనివర్సిటీ ఆచార్య విస్తాలి శంకర్‌రావు ప్రశంసించి సత్కరించారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మహబూబాబాద్ టౌన్, మార్చి 5: మార్చి1వ తేదీన వేతనం బ్యాంకుఖాతాల్లో పడడాన్ని హర్షిస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలమాస శంకర్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

దేవాలయ చైర్మన్ బాధ్యతల స్వీకరణ



జంబో కూలర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కురవి, మార్చి 5 : కురవి శ్రీ వీరభద్రస్వామి దేవాలయ చైర్మన్‌గా కోర్నె రవీందర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో పూజా కార్యక్రమాల అనంతరం ధర్మకర్తలతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఆలయంలో జాతర కోసం ఏర్పాటు చేసిన నాలుగు జంబో కూలర్లను ప్రారంభించారు. అనంతరం గాల్వానియం (శాశ్వత రేకుల షెడ్డు) నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్న గణేష్, సక్రు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కేసముద్రం, మార్చి 5 : పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతోందని డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని అమినాపురంలో మంగళవారం గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో బిల్లుల జారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్వలలో గృహజ్యోతి బిల్లుల జారీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట సంజీవ రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, కొంతం శ్రీనివాస్, కొమ్మాల దేవేందర్‌రెడ్డి, ఎల్లగౌడ్, పెదగాని రవి, చింతనూరి వెంకన్న, మూరగు ఒడ్ల అనంతరాములు, ఆకుల సుధాకర్ పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

దంతాలపల్లి, మార్చి 5: పంట సాగు చేస్తున్న రైతన్నలు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని ఏవో కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీబాలాజీ ఫంక్షన్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వం (ఎఫ్‌పీవో) ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్కీమ్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బేయర్ కంపెనీ ముఖ్య అతిథి రాజేష్‌సింగ్, కుమారస్వామిజీ, సాయిరెడ్డి, జయపాల్‌రెడ్డి, ఏఈవోలు సందీప్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడికి చర్యలు చేపట్టాలి

తొర్రూరు, మార్చి 5: రాబోయే వేసవిలో గ్రామాల్లో తాగునీటి కోసం సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాలార్ సాహెబ్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో గౌస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ శాస్త్రవేత్తకు సన్మానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 :మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పుల్లూరు భరత్‌కుమార్ తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని డీఆర్‌డీఏ శాస్త్రవేత్త(గ్రూప్ ఏ గెజిటెడ్ ఆఫీసర్)గా ఎంపికయ్యారు. పట్టణంలోని యువశాస్త్రవేత్త భరత్ కుమార్ స్వగృహంలో మంగళవారం న్యాయవాదులు తుంపిళ్ల శ్రీనివాస్, ఎస్కె పాషా, దర్శనం రామకృష్ణ ఆయనుకు శాలువా కప్పి సన్మానించారు. భరత్‌కుమార్ శాస్త్రవేత్తగా ఎంపిక కావడంపై తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా తస్లీమా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 : తెలంగాణ రాష్ట్ర కాంట్రీబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) మహబూబాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమామహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు పూసపాటి నాగముని తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఏకగ్రీవంగా తస్లీమా మహ్మద్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు.

పూలే విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 :మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన ప్రాంగణంలో ఈ నెల 10న ఆవిష్కరించనున్న సావిత్రిబాయి పూలె, మహిళా సదస్సును జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో మంగళవారం విగ్రహావిష్కరణ, మహిళా సదస్సు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలాష్టి రమేష్, సువర్ణ, రాచకొండ ఉపేందర్, గిరిజ, అనిత, కవిత, హరిణి, యాకయ్య, బాబురావు, నరేష్ పాల్గొన్నారు.

డీపీఆర్వో బాధ్యతల స్వీకరణ

మహబూబాబాద్ టౌన్, మార్చి 4: మహబూబాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ (డీపీఆర్వో)గా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మానుకోట డీపీఆర్వోగా బదిలీపై వచ్చిన రాజేంద్రప్రసాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాల యంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌లను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం కురవిలోని శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఆర్వో రాజేంద్రప్రసాద్

మృతుడి కుటుంబానికి చేయూత



ఉమేష్ కుటుంబానికి బాండ్‌లను అందజేస్తున్న రాజేష్, గ్రామస్తులు

కేసముద్రం, మార్చి 5 : కేసముద్రం మండలం కల్వలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబం కోసం అదే గ్రామానికి చెందిన బొగ్గుల రాజేష్ రూ.3లక్షల విరాళాలను సేకరించాడు. ముప్ప ఉమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు భార్య అనూష, కూతుళ్లు ఐదేళ్ల మన్విత, మూడేళ్ల నిత్యశ్రీ ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో పిల్లల పరిస్థితిని చూసి చలించిపోయిన అదే గ్రామానికి చెందిన బొగ్గుల రాజేష్ తాను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఎస్ఎస్ ట్యుటోరియల్‌లోని సహ ఉద్యోగులు, మిత్రులు, గ్రామస్తులు ద్వారా విరాళాలు సేకరించారు. రాజేష్ మిత్రులు పోడేటి దినేష్, మార్గం విష్ణు, గండి సాయిచంద్, ఏదునూరి మహేందర్, బొగ్గుల శ్రీధర్, గట్టు శశికుమార్‌ల సహాయంతో 212 మంది నుంచి రూ.3.18లక్షలను సేకరించి ఉమేష్ ఇద్దరు చిన్నారి కూతుళ్ల పేరిట రూ.3లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్, రూ.18వేల విలువైన నిత్యావసర వస్తువులను మంగళవారం గ్రామంలో అందజేశారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గంట సంజీవరెడ్డి, చింతనూరి వెంకన్న, బొగ్గుల నాగయ్య, గండి శ్రీనివాస్, చందా గోపి, లింగాల పిచ్చయ్య, మోడెం రవీందర్‌గౌడ్, కూన భద్రాద్రి పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు 12 మంది ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మార్గదర్శి బీ.ఎడ్ కళాశాల 12 మంది పూర్వ విద్యార్థులు ఇటీవల ప్రకటించిన గురుకుల ఉపాధ్యాయ పోస్టుల కు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మంగళవారం తెలిపారు. పూర్వవిద్యార్థులైన అయిల బోయన సృజన (డిగ్రీ అధ్యాపకురాలు), జి. రవీందర్, మోహన్ (జూనియర్ అధ్యాపకులు), ఆర్. సంధ్య, ఆకారపు వాణి, టి. గౌతమి, రమణ, నాగరాజు, సురేష్, శంకర్‌రెడ్డి (టీజీటీ), మోహన్ (పీజీటీ), బి. సౌజన్య (ఏఆర్ కానిస్టేబుల్) ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంధ్యారాణి తెలిపా రు. తమ కళాశాలలో బి.ఎడ్ పూర్తి చేసి ఒకేసారి 12 మంది ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ తక్కెళ్లపల్లి సంధ్యారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-1 పోటీ పరీక్ష ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్‌భూపాలపల్లి, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు చెందిన అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను హనుమ కొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో 7న సాయంత్రం 5 గంటల్లోగా అందించాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండా లన్నారు. ఎంపిక విధానం డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929ను సంప్రదించాలన్నారు.

అంబేద్కర్ విదేశీ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 5 : తెలంగాణ ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వార షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బాలరాజు మంగళవారం తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.20 లక్షలు మంజూరు చేస్తుందని, ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. అర్హులైన విద్యార్థులు వెబ్‌సైట్ www.telangana.epass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849943887, 9440120620ను సంప్రదించాలన్నారు.

పెండింగ్ రుణాలు మంజూరు చేయాలి

గార్ల, మార్చి 5 : మండల వ్యాప్తంగా ఎసీ కార్పొరేషన్‌లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పెండింగ్ రుణాలను సత్వరమే అందించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరినాయక్ డిమాండ్ చేశారు. ఎస్టీ కార్పొరేషన్‌లో పెండింగ్ రుణాలు అందించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం గార్ల ఎంపీడీవో మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. మాలోత్ శాంతి కుమార్, భూక్యా ఫుల్‌సింగ్, మంగిలాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేపట్టాలి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వీధిలైట్లు, సెంట్రల్ లైటింగ్ లను పరిశీలించారు. సంత పరిసరాల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన నీటి సౌకర్యాన్ని, జాతర కోసం ప్రత్యేకంగా వేస్తున్న కలకత్తా డెకొరేషన్‌లను పరిశీలించారు. అనంతరం కురవిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను సందర్శించి దేవాదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఈవో సత్యనారాయణలను ఆదేశించారు. ఆలయ ఈవో సత్యనారాయణ, దేవాలయ చైర్మన్ కోర్నె రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకు లు అంబటి వీరభద్రం, ప్రతాపని భిక్షమయ్య, ఎర్ర నాగేశ్వర్‌రావు, అవిరే మోహన్‌రావు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలి

మహబూబాబాద్ టౌన్, మార్చి 5: మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని వ్యాపారులు ఈ నెల 31 వరకు ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31లోగా కొత్తగా ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించిన వారికి ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్‌ను జారీ చేస్తామని పేర్కొన్నారు. ఒక వేళ ఈ నెల 31 వరకు లైసెన్స్ రెన్యూవల్ చేసుకోక పోతే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నియమనిబంధనల ప్రకారం జీవోఎంఎస్.నెం. 147 ప్రకారం పునరుద్ధరణ ధరను చెల్లించిన తర్వాత ట్రేడ్ లైసెన్స్ ఆటోమెటిక్‌గా పునరుద్ధరించబడుతుందని చెప్పారు. ఈ నెలలో రెన్యూవల్ చేసుకోకపోతే అదనంగా అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ నెల 31వరకు ఎలాంటి ఫైన్ లేకుండా, ఏప్రిల్ 1 నుంచి జూన్ 31 వరకు 25 శాతం పెనాల్టీ, జూలై 1 నుంచి 50 శాతం ఫెనాల్టీతో చెల్లించాల్సి వస్తుందన్నారు మీ సేవా కేంద్రాల్లో ట్రేడ్ లైసెన్స్ పన్నును https://cdma.cgg.gov.in/ లో స్టేట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు ద్వారా చెల్లించవచ్చన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండా వ్యాపారాలు చేసేవారు కొత్తగా ట్రేడ్ లైసెన్స్ పన్ను కట్టి సర్టిఫికెట్ పొందాలని లేని పక్షంలో చర్యలుంటాయని తెలిపారు. ఈ సదవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకుని సకాలంలో ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లించి మునిసిపల్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ రవీందర్ విజ్ఞప్తి చేశారు.

మూడు హైస్కూళ్లలో పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

కేసముద్రం, మార్చి 5 : కేసముద్రం మండలం ఉప్పరపల్లి, కాట్రపల్లి, ఇంటికన్నె జడ్పీహైస్కూళ్లలో మంగళవారం సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు, స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయసుశీల, వీరభద్రం, సుజాత, బండారు వేణుగౌడ్, తండా శ్రీనివాస్, పలుస వెంకన్న, పబ్బతి సారంగం, కంది రవి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో విద్యార్థుల డీబార్

గార్ల, మార్చి 5 : గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్ మాస్ కాపీయి ంగ్ జోరుగా కొనసాగుతుందనే సమాచారంతో ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు స్పెషల్ స్క్వాడ్ బృందం మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఇంటర్ సెకండియర్ పొలిటికల్ సైన్స్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండగా తనిఖీ విభాగపు అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా ఆరుగురు విద్యార్థులు దొరికారు. దీంతో వారిని డీబార్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ రూపన్ గోవిందరావు తెలిపారు.

బయ్యారంలో ఇద్దరు..

బయ్యారం : మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడిన ఇరువురు విద్యార్థులను స్టేట్‌బోర్డు అబ్జర్వర్లు మంగళవారం డీబార్ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్ పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. బయ్యారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మంగళవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు మొత్తం 137 మంది విద్యార్థులకు గాను 134 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లోని బైపీసీ చదువుతున్న విద్యార్థి, సీఈసీ చదువుతున్న విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ తనిఖీకి వచ్చిన స్టేట్ బోర్డు అబ్జర్వర్లకు పట్టుబడ్డట్లు వెల్లడించారు. దీంతో స్టేట్ బోర్డు అబ్జర్వర్లు ఇరువురు విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

- డోర్నకల్ : డీడీ జూనియర్ కళాశాలలో పొలిటికల్ సైన్స్ పరీక్షకు హాజరైన నలుగురు విద్యార్థులను హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషల్ స్క్వాడ్ పట్టుకుని డీబార్ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

పెద్దవంగర ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

పెద్దవంగర, మార్చి 5: పెద్దవంగర ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై అవిశ్వాస తీర్మానం చేస్తూ మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. మండలం పరిధిలో తొమ్మిది మంది ఎంపీటీసీలు ఉండగా అందులో పెద్దవంగర ఎంపీటీసీ సొంత కారణాలతో రాజీనామా చేశారు. ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉండగా అందులో ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎంపీపీ రాజేశ్వరి విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఆమె భర్త సొంత నిర్ణయాలు కారణంగానే తాము అవిశ్వాస తీర్మానం అందజేసినట్లు తెలిపారు. అవిశ్వాసం తెలిపిన వారిలో వైస్‌ఎంపీపీ బొమ్మరబోయిన కల్పన, ఎంపీటీసీలు బానోతు రవీందర్, ఎర్ర సబిత, బానోతు విజయ, ఈరెంటి అనురాధ, మెట్టు సౌజన్య తదితరులు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 5 : దేశీ కోర్సులో నేర్చుకున్న వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణా ప్రాంతాల్లోని రైతులకు ఉపయోగపడేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.అభిమన్యు కోరారు. మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా వ్యవసాయ సాంకేతిక అవగాహన సదస్సు ముగింపు సమావేశంలో మాట్లాడారు. కేవీకే కోఆర్డినేటర్ మాలతి, ఏడీఏ లక్ష్మీనారాయణ, దేశీ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఏడీఏ డి.నరేందర్, మండల వ్యవసాయాధికారి తిరుపతిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.